అదనులో పదును కరువాయె!

- ఆరుద్ర కార్తె వచ్చినా సాగని అరక
- నేల రాలని చినుకులు.. పది శాతం కూడా పడని విత్తనం
- విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకొని ఎరుదుచూపు



వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతన్న (ఫైల్)

రాయదుర్గం: ఖరీఫ్ సీజన్ రానే వచ్చింది.. ఏటా జూన్ నెల ప్రారంభంలోనే వేరుశనగ, ఇతర పంటలు సాగయ్యేవి.. జూలై నెల వచ్చినా.. అదునులో వర్షం పడలేదు. రెండు రోజులు మురిపించిన తొలకరి వానలు అసలు సమయంలో ముఖం చాటేశాయి. నైరుతి రుతు పవనాలు దోబూచులాడుతున్నాయి. మృగశిర కార్తె కంటే ముందే తొలకరి పలకరించింది. సాధారణంగా జూన్ 1 నుంచి జూలై 15 లోపు విత్తుకు అనుకూలమని సాగుకు అన్నదాతలు సర్వం సిద్ధం చేసుకొని ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఇప్పటి దాక 10 శాతం కూడా సాగు సాగలేదు. 2,90,473 హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణం కాగా, ఇందులో 2,44,517 హెక్టార్లు సాగులోకి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటిదాకా కేవలం 11,014 హెక్టార్లు మాత్రమే వేరుశనగ, కంది, ఆముదం, పత్తి, మొక్క జొన్న లాంటి పంటలు మొలకెత్తాయి. పొలాల్లో తేమశాతం లేక అన్నదాతల్లో ఆందోళన కనిపిస్తోంది. ఓ వైపు రైతులు విత్తనాలు, ఎరువులు, సమకూర్చుకున్నారు. మరోవైపు రైతు వంతుగా ఎరువులు చల్లడం, దుక్కులు చేయడం పూర్తి చేసుకున్నారు. ఇలాంటి సమయంలో వరుణుడు ముసుగేయడంతో అన్నదాతలు ఆకాశం వైపు చూస్తున్నారు. అరుద్రలో అదునులో పదును అయినా చకచకగా విత్తనాలు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

జూలై 15 వరకు అనుకూలం

ఖరీఫ్ సాగుకు ఇంకా సమయం ఉంది. వచ్చే నెల జూలై 15 వరకు పంటలు సాగుచేసుకోవచ్చు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ఏడీఏలు లక్ష్మానాయక్, యల్లప్ప, పద్మజ సూచించారు. వర్షం ఎప్పుడు పడినా విత్తుకోవచ్చని చెప్తున్నారు. అవసరమైన విత్తనాలు, ఎరువులు సమకూర్చామన్నారు. ఈ కార్తె నుంచే పదును వర్షాలు కురుస్తాయని వివరించారు.

వేరుశనగ పంట సాగు వివరాలు ఇలా..

నియోజకవర్గం	సాధారణ సాగు (హెక్టార్లు)	సాగు అంచనా (హెక్టార్లు)	ప్రస్తుత సాగు (హెక్టార్లు)
రాయదుర్గం	66,414	38,507	3,812
కళ్యాణదుర్గం	67,754	55,400	2,982
ఉరవకొండ	1,60,090	1,50,610	4,220

వర్షం కోసం ఎదురుచూపు



పదెకరాల్లో వేరుశనగ సాగుకోసం నేల దుక్కులు పూర్తి చేశాను. ఎరువులు, విత్తనాలు సిద్ధం చేసుకున్నాను. నిండు వేసవిలో అకాల వర్షాలు కురిశాయి. తొలకరి వర్షాలు ముందస్తుగా పులకరించినా, కార్తెలన్నీ కారు మబ్బులే కనిపిస్తున్నాయి. చిరుజల్లులతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. పదునైన వర్షం కురిసినా విత్తనాలు వేసేందుకు సిద్ధంగా ఉన్నాం. – శివన్న, రైతు, రంగచేడు

ఆందోళన చెందాల్సిన పనిలేదు



ఖరీఫ్ సాగు ఇంకా ఆరంభం మాత్రమే. జూలై 15 వరకు విత్తుకు అనుకూలం. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అరకొర తేమకు విత్తుకోవడం మంచిది కాదు. పదునైన తేమలోనే విత్తనం నాటుకోవాలి. ఇప్పటికే మొలకెత్తిన పైరుకు చిరుజల్లులతో ఉపశమనం కలుగుతోంది. అరుద్ర కార్తె రావడంతో కారు మబ్బులు కమ్ముకొస్తున్నాయి. వర్షం పడే అవకాశం ఉంది. వేరుశనగలో అంతర పంటగా కంది, ఆముదం వేసుకోవాలి.

– పద్మజ, ఏడీఏ, రాయదుర్గం

క్లుప్తంగా

'శ్రీరామరెడ్డి' కార్మికులు పాదయాత్రకు శ్రీకారం



కళ్యాణదుర్గంలో కరపత్రాలు విడుదల చేస్తున్న కార్మికులు

కళ్యాణదుర్గం రూరల్: శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు సమస్యలు పరిష్కరించాలని జూలై 2 నుంచి 5వతేదీ వరకు పాదయాత్ర చేస్తున్నట్లు శ్రీరామరెడ్డి వాటర్ సప్లయ్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యుడు ఎర్రిస్వామి తెలిపారు. ఆదివారం పాదయాత్ర కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తమకు జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కళ్యాణదుర్గం అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి పాదయాత్ర ప్రారంభమై జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వరకు సాగుతుందన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రం కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా కార్మికుల పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘంలోని కౌన్సిల్ హాల్‌లో ఈనెల 30న ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తెలిపారు. సమావేశంలో పట్టణంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ప్రజా సమస్యలపై చర్చించనున్నట్లు చెప్పారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు, విభాగాల వారిగా అధికారులు హాజరుకావాలని కోరారు.

మొహర్రం వేడుకలకు అనుమతి తప్పనిసరి




మాట్లాడుతున్న ఎస్ఐ నబీరసూల్

బొమ్మనహాళ్: మొహర్రం ఉత్సవాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. ఆదివారం పీర్ల పండుగ నిర్వహణపై మండలంలోని పలు గ్రామాల నిర్వాహకులతో మాట్లాడారు. గ్రామాల్లో పీర్లను కొలువుదీర్చే నిర్వాహకులు, గ్రామ పెద్దలు పోలీస్ స్టేషన్‌కు వచ్చి అనుమతి పొందాలన్నారు. గ్రామ చావిడీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. పీర్లచావిడిల వద్ద ఎలాంటి అల్లర్లు, గొడవలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులదేనన్నారు.

దూడపై చిరుత దాడి

శెట్టూరు: మండలంలోని చిన్నంపల్లిలో చిరుత దాడిలో గేదె దూడ మృతి చెందింది. గ్రామ చివరన ఉన్న జనార్దన పశువుల పాకలోని గేదెలపై ఆదివారం తెల్లవారుజామున చిరుత దాడి చేసింది. దాడిలో గేదె దూడ మృతి చెందింది. అటవీశాఖ సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతి చెందిన దూడకు పంచనామా చేశారు. రాత్రివేళలో గ్రామానికి సమీపంలోనే చిరుత సంచరిస్తుండడంతో గ్రామస్తులు భయందోళనకు గురవుతున్నారు.

కామ్రేడ్ లక్ష్మన్న సేవలు మరువలేనివి



స్థూపాన్ని ప్రారంభిస్తున్న ఎన్. రఘువీరారెడ్డి, సీపీఐ కార్యదర్శి రామకృష్ణ

కుందుర్పి: కామ్రేడ్ లక్ష్మన్న సేవలు మరువలేనివని మాజీ మంత్రి ఎన్. రఘువీరారెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఐ సీనియర్ నేత కామ్రేడ్ పీ.లక్ష్మన్న ప్రథమ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి ఎన్. రఘువీరారెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు హాజరై నూతనంగా నిర్మించిన కామ్రేడ్ లక్ష్మన్న స్థూపాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ సంజీవులు, ఏపీ జిల్లా మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పద్మావతి, ఏఐవైఎఫ్ సహాయ కార్యదర్శి సంతోష్ కుమార్, డివిజన్ కార్యదర్శి గోపాల్, మాజీ ఎంపీపీ గిరిజమ్మ, మండల నాయకులు హరిదాసు, మహదేవ, లక్ష్మన్న కుటుంబ సభ్యులు రాధకృష్ణంరాజు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంపనూరుకు పోటెత్తిన భక్తులు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తొలుత అర్చకులు స్వామిని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఆకుపూజ అనంతరం పంచామృతాభిషేకాలు చేపట్టారు. స్వామి వారి స్వర్ణముఖ కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ఊరేగించారు.

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్‌కు పోరాడాలి



విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ మంత్రి ఎన్. రఘువీరారెడ్డి

కుందుర్పి: ఆర్డీటీ పేదలకు వరమని, సంస్థ ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్‌కు అందరం సమష్టిగా పోరాడాలని మాజీ మంత్రి ఎన్. రఘువీరారెడ్డి కోరారు. ఆదివారం ఆయన కుందుర్పిలో నిర్మించిన ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఆలయాన్ని స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. జిల్లాలో ఎక్కడాలేని విధంగా రూ.కోట్లతో ఫెర్రర్ ఆలయాన్ని నిర్మించడం హర్షణీయమన్నారు. ఆర్డీటీ లేకపోతే జిల్లాలో పేదలు బతికే పరిస్థితిలేదన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ పరంగా ఆర్డీటీ అనేక సేవలు అందించిందన్నారు. ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ కోసం తాను కూడా ఢిల్లీలో బీజేపీ మంత్రులతో మాట్లాడాతానని చెప్పారు. అనంతరం ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలమ్మ, మాజీ మండల కన్వీనర్ సత్యానారాయణశాస్త్రి, ప్రస్తుత కన్వీనర్ హనుమంతరాయుడు, సర్పంచ్ రామూర్తి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాజగోపాల్, వార్డు సభ్యుడు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్‌సీసీ శిక్షణ తరగతులు



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసు ఉన్నతాధికారి

కూడేరు: మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద ఎన్‌సీసీ నగర్‌లో సీఏటీసీ–5 ఎన్‌సీసీ శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. ఆదివారం పోలీసు ఉన్నతాధికారులు ఎన్‌సీసీ క్యాడెట్లకు చైల్డ్ పోర్నోగ్రఫీ, ఓటీపీ మోసాలు, ఫేక్ లోన్ యాప్స్ , హనీ ట్రాప్, లాటరీల పేరుతో జరిగే మోసాలు, ఇతర సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నేరం జరిగిన పక్షంలో వెంటనే 1930కు ఎలా ఫిర్యాదు చేయాలి.. నేరం జరిగిన గంటలోపు ఫిర్యాదు చేస్తే వచ్చే ఫలితాలపై తెలియజేశారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండర్ ఎల్‌డీ రాడ్రిక్స్, ఎన్‌సీసీ అధికారులు శారద, సంగీత, శశికళ, ఇంద్ర బహదూర్, నాగేంద్రప్రసాద్, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాకు చెందిన 500 మంది క్యాడెట్లు పాల్గొన్నారు.

'విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం'

కళ్యాణదుర్గం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి కాశీరామ్ నాయక్ విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో బాలికల విద్యపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. హైస్కూల్ హాస్టల్ ఫండ్‌ను పూర్తిగా తగ్గించిందని గుర్తు చేశారు. హాస్టళ్ల నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఫలితంగా ఇంటర్ విద్యపై ప్రభావం చూపుతుందన్నారు. కూటమి ప్రభుత్వం విద్యను వ్యాపారంగా మార్చిందని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు విద్యారంగానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని గుర్తు చేశారు. పేద పిల్లల ఉన్నత విద్యను వ్యాపారంగా మారుస్తూ పేద పిల్లల భవిష్యత్‌ను నాశనం చేసేలా ప్రభుత్వం చర్యలను ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు.

మురుగు ముందుకెళ్లేదెలా?



రాయదుర్గంలో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



సచివాలయం, నారాయణ స్కూల్‌కు వెళ్లే దారిలో నిలిచిన మురుగు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కేబీ ప్యాలెస్ రోడ్డు నుంచి పాతమీసేవా కేంద్రం, కొలిమివీధికి వెళ్లే ప్రధాన మార్గం నాలుగు రోడ్ల కూడలిలో ఒకవైపు డ్రైనేజీ, మరోవైపు రోడ్డు అధ్వానంగా ఉంది. డ్రైనేజీ డిస్పోజల్ లేక మురుగునీరు రోడ్డుపైకి వచ్చి నిల్వ ఉంటోంది. అక్కడే కేబీ ప్యాలెస్ రోడ్డుకు వెళ్లే దారిపై డ్రైనేజీ నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన సీసీ పైప్ ధ్వంసం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే ఆ ప్రాంతంలో డ్రైనేజీనీటితోపాటు బురదపేరుకుపోతోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ కూడలిలో రోడ్డును మరమ్మతు రాకపోకలకు సమస్య లేకుండా చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



శనీశ్వరాలయం వద్ద ప్రధాన విద్యుత్‌వైర్లకు అల్లుకున్న తీగలు



భగత్‌సింగ్ మున్సిపల్ స్కూల్ ప్రహరీపై చెట్టు కొమ్మల నడమ ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

అల్లుకున్న నిర్లక్ష్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డులో మార్కెట్ యార్డు వద్ద నుంచి శనీశ్వరాలయం వరకు పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లకు తీగలు అల్లుకున్నాయి. ఈదురు గాలులు, భారీ వర్షాలకు తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. భగత్‌సింగ్ మున్సిపల్ స్కూల్ వద్ద చెట్టు కొమ్మల మధ్య విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వెళ్లాయి. వీటిని తొలగించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాల్సిన అధికారులు పట్టించుకోలేదు.



విద్యుత్ స్తంభానికి ఇలా..

శ్రీవారి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే విశ్వ



తిరుమలలో మాజీ ఎమ్మెల్యే విశ్వతో పాటు ఎమ్మెల్సీ తుమ్మాటి మాధవ

ఉరవకొండ: తిరుమలలో వేంకటేశ్వర స్వామిని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఎమ్మెల్సీ తుమ్మాటి మాధవతో కలిసి మాజీ ఎమ్మెల్యే విశ్వ శ్రీవారిని దర్శించుకున్నారు. ఆగస్టు 14న మాజీ ఎమ్మెల్యే విశ్వ తనయుడు వై.ప్రణయ్‌రెడ్డి వివాహం జరగనుంది. వాహహ పత్రికలు శ్రీవారి సన్నిధిలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారిని దర్శించుకున్న వారిలో పార్టీ జిల్లా అధికారప్రతినిధి సీపీ వీరన్న ఉన్నారు.

సబ్సిడీతో రైతులకు దాణా సరఫరా

కళ్యాణదుర్గం రూరల్: ప్రభుత్వం సబ్సిడీతో రైతులకు దాణా అందిస్తోందని పశువైద్యాధికారి మునాథ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలానికి 32 టన్నుల పశు దాణాను 50 శాతం సిబ్సిడీతో సరఫరా చేస్తామన్నారు. 50 కేజీల దాణా బ్యాగ్ సబ్సిడీ పోనూ పాడి రైతు వాటా కింద రూ. 550 చెల్లించాలన్నారు. గరిష్టం రైతుకు 3 బ్యాగులు సరఫరా చేస్తామన్నారు.

వేరుశనగకు తెగుళ్ల బెడద



కదదరకుంట వద్ద తెగుళ్ల బారిన పడిన వేరుశనగ పంట

కూడేరు: మండలంలో బోరుబావుల కింద సాగు అయిన వేరుశనగ పంటకు తెగుళ్ల సోకాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని కదదరకుంట, ఇప్పేరు, మరుట్ల, కలగళ్ల, అరవకూరు, జల్లిపల్లి, ముద్దలాపురం, పి.నారాయణపురం, కరుట్లపల్లి, చోళసముద్రం, జయపురం, కొర్రకోడు, హంసాయపల్లి, కూడేరు, అంతరగంగ, గొటుకూరు, ఎంఎంహళ్లితో పాటు మరికొన్ని గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాల్లో రైతులు వేరుశనగ సాగు చేశారు. పంటకు ఆకుముడత, పచ్చ పురుగు, లద్దె పురుగు, మచ్చు తెగుళ్ల ఆశించాయి. రైతులు రసాయన మందులు పిచికారీ చేసినా తెగుళ్ల తగ్గుముఖం పట్టడం లేదు. దీంతో ఏమి చేయాలో దిక్కుచోచక రైతులు ఆందోళన చెందుతున్నారు.

నీలగిరిస్వామి ఆలయంలో పూజలు



అలంకరణలో నీలగిరిస్వామి

వజ్రకరూరు: స్థానిక కురుబవీధిలో భక్తుల కొంగు బంగారం నీలగిరిస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు ఆకు పూజ, మహామంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం, విశేష పూజలు నిర్వహించారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత





రాయదుర్గంలోని యూపీఎస్ పోలీస్ స్టేషన్, పోలీసుల పర్యవేక్షణ లేక పట్టణంలో రోడ్లపై వ్యాపారాలతో ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్న వాహనదారులు, పాదచారులు

- రాయదుర్గం స్టేషన్‌లో 54 మందికి 14 మందే
- విధుల్లో ఉన్న సిబ్బందిపై విపరీతమైన పనిభారం
- శాంతిభద్రతల పరిరక్షణకు విఘాతం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం అర్బన్ పోలీస్టేషన్‌లో పోలీసు సిబ్బంది కొరత వేధిస్తోంది. ఉన్న సిబ్బందితో సీఐ, ఎస్ఐలకు శాంతిభద్రతల పరిరక్షణ కత్తిమీద సాములా మారింది. ఇటీవల రాయదుర్గం యూపీఎస్‌కు నలుగురు కానిస్టేబుళ్లు బదిలీ కాగా, వీరిలో కేవలం ఇద్దరు మాత్రమే చేరినట్లు స్టేషన్ వర్గాలు తెలిపాయి. ఇటీవల ఇద్దరు ఏఎస్ఐలు, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, ఐదుగురు కానిస్టేబుళ్లు బదిలీపై వెళ్లారు. దీంతో పోలీసు సిబ్బంది కొరతతో పని చేస్తున్న వారిపై ఒత్తిడి, పనిభారం పెరిగింది. రాయదుర్గం అర్బన్ స్టేషన్‌లో ఒక సీఐ, ఒక ఎస్ఐ, నలుగురు ఏఎస్ఐలు, 8 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 40 మంది కానిస్టేబుళ్లు కలిపి మొత్తం 54 మంది పని చేయాల్సి ఉంది. కానీ సీఐ, ఎస్ఐతోపాటు ఇద్దరు ఏఎస్ఐలు, ముగ్గురు హెడ్‌కానిస్టేబుళ్లు, కేవలం ఏడుగురు కానిస్టేబుళ్లతో కలిపి కేవలం 14 మంది పని చేస్తున్నారు. రాయదుర్గం మున్సిపాలిటీలో దాదాపు 70 వేలకు పైగా జనాభా ఉంది. రూరల్ పరిధిలోని 50 వేలకుపైగా జనాభా ఉంది. దీంతోపాటు నిత్యం ఏదో ఒక రాజకీయ కార్యక్రమాలు, ధర్నాలు, ప్రమాదాలు, స్టేషన్‌కు వచ్చే అర్జీల క్షేత్రస్థాయి విచారణ, నైట్ డ్యూటీలు, గ్రామాలు, పట్టణంలో గస్తీ, సరిహద్దుల్లో నిఘా, కేసుల విచారణకు సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఉన్న సిబ్బందిలోనూ సెంట్రీ డ్యూటీలు, పట్టణంలో నైట్ డ్యూటీలకు మరింత ఆటంకం కలుగుతోంది. స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ సైతం నమోదుకు కంప్యూటర్ ఆపరేటింగ్ చేసేందుకు సిబ్బంది లేరంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో తెలుస్తోంది.

విధుల అటాచ్‌తో మరిన్ని కష్టాలు:

కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన రాయదుర్గం స్టేషన్‌లో ఒక వైపు సిబ్బంది కొరత వేధిస్తుండగా తరుచూ రాజధానితో పాటు జిల్లా కేంద్రంలో జరిగే ముఖ్య కార్యక్రమాలకు స్పెషల్ పార్టీ విధులకు ఇక్కడి సిబ్బందిని కేటాయిస్తుండడంతో పోలీసులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. స్టేషన్‌లో సిబ్బంది కనిపించని పరిస్థితి ఉంది. 8 మంది హోంగార్డులు ఉండగా వారితోనే పరిస్థితి చక్కదిద్దుకోవాల్సివస్తోంది. ఉదయం నలుగురు హోంగార్డులు, రాత్రి నలుగురు హోంగార్డులను విధులకు వినియోగించుకుంటూ నెట్టుకొస్తున్నారు.

అటకెక్కిన ట్రాఫిక్ నియంత్రణ :

పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ అటకెక్కింది. ప్రధాన కూడళ్లలో విపరీతమైన ట్రాఫిక్ రాకపోకలు ఉన్నాయి. పోలీసులు సిబ్బంది లేకపోవడంతో చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు, ఆటోవాలాలు, ప్రైవేట్ బస్సులు ఇష్టానుసారంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. మరోవైపు ఎక్కపడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేస్తూ ట్రాఫిక్‌ను మరింత జఠిలం చేస్తున్న పరిస్థితి ఉంది. నియంత్రించేందుకు సిబ్బంది లేక ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది.

2న ఉరవకొండలో ముఖ్యనేతల సమావేశం

కూడేరు: ఉరవకొండలోని వీరశైవ కళ్యాణ మంటపంలో జూలై 2న వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతల సమావేశం జరగనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామచంద్రా రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం నియోజకవర్గ సమన్వయ కర్త విశ్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జ్ నరేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, యువ నేత ప్రణయ్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. సమావేశానికి ఎంపీపీ, సర్పంచులు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ అనుబంధ సంఘాల కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు హాజరు కావాలన్నారు.

గ్రంథాలయ అధికారిగా ఎం.శ్రీనివాసులు

వజ్రకరూరు: స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిగా ఎం.శ్రీనివాసులు నియమితులయ్యారు. వజ్రకరూరులో పనిచేస్తున్న గ్రంథాలయ అధికారి మునెమ్మ విడపనకల్లు మండలానికి బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న ఎం.శ్రీనివాసులు వజ్రకరూరుకు బదిలీ అయ్యారు. ఆదివారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు.